ఉచిత వైద్య శిబిరం

అంబర్‌పేట: పేదలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి వారికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులను ఉచితంగా అందించారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట బతుకమ్మకుంటలో చెంచుబస్తీలో స్వాంతన, గద్దె రామోజీ ఫౌండేషన్, కిమ్స్ ఫౌండేషన్, భారత్ వికాస్ పరిషత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్, పీడియాట్రిక్, గైనాలకాలజీ, ఆర్థోపెడిక్ వైద్యులు హాజరై వైద్య సేవలు అందించారు. సుమారు 200మందికి వైద్య సలహాలు, ఉచిత మందులు అందించారు. నిర్వాహకులు శివరామకృష్ణ, రవికుమార్, శేఖర్, నర్సింగ్ రావు, లావణ్య, వైద్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

కాచిగూడ: మోతీమార్కెట్‌లో మంచినీటిను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి జలమండలి అధికారులకు సూచించారు. ఆదివారం డివిజన్‌లోని మోతీమార్కెట్, చెప్పల్ బజార్, కుద్బిగూడ, శివం టెంపుల్ లేన్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. నల్లాల ద్వారా ప్రెషర్‌తో మంచినీరు వస్తోందన్నారు. వచ్చే కొద్దిపాటి నీరు కూడా పొల్యూషన్‌తో వస్తోందని స్థానికులు కార్పొరేటర్‌కు తెలిపారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కోరారు. బీజేపీ నేతలు ఎస్.రవియాదవ్, బి.భీమ్‌రాజ్, మల్లికార్జున్, రమాదేవి, ఆర్.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోతో ఆత్మవిశ్వాసం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తైక్వాండోలో తర్ఫీదు పొందితే ఆత్మవిశ్వాసం పెంపొందటంతో పాటు ఆత్మ రక్షణకు దోహదపడతాయని తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు వి.కృష్ణ అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని స్వరాజ్ కమ్యూనిటీహాల్‌లో తైక్వాండో హైదరాబాద్ జిల్లా 6వ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఈ పోటీలల్లో 300 క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. అనంతరం విజేతలకు మెమొంటోలతో సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

విరసం ఆవిర్భావ దినోత్సవం జూలై 6న

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జూలై 6వ తేదీన విరసం ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు విరసం కార్యవర్గ సభ్యులు రాము తెలిపారు. ఆదివారం ఎస్వీ కేంద్రం వద్ద విరసం ఆవిర్భావ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేధావులు, విద్యార్థులు, సామాజికవేత్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో విరసం సభ్యులు రాంకీ, సుధాకర్, సాగర్, రవిచంద్ర, కరుణ, చందు, భూపతి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముగిసిన వాగ్గేయకార ఆరాధన సంగీతోత్సవాలు

నల్లకుంట: శ్రీరామ గానసభ ఆధ్వర్యంలో ఈనెల 23న న్యూ నల్లకుంటలోని శ్రీసీతారామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలో ప్రారంభమైన 56వ వాగ్గేయకార ఆరాధన సంగీతోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ముగింపు వేడుకలకు వ్యాఖ్యాతగా ప్రముఖ సంగీత విద్వాంసుడు పీవీ.సుబ్బారావు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉదయం నాదోపాసన బృందం నిర్వహించిన సంగీత కచేరి ఆకట్టుకుంది. అనంతరం నిర్వహించిన భద్రాచల రామదాసు నవరత్న కీర్తనల కోష్టి గానం సంగీత ప్రియులను అలరించింది. ఈ వేడుకల్లో శ్రీరామగానసభ అధ్యక్షుడు నాగరాజన్, ఉపాధ్యక్షుడు కేవీ తిరుమలరావు, కేఎస్ ఆనంద్, కార్యదర్శి సాయిశ్రీనివాసశర్మ, కోశాధికారి పీవీ.సుబ్బారావు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

12 గంటల పాటు నిర్విరామంగా పాటలు

చిక్కడపల్లి: నగరంలోని ప్రముఖ కల్చరల్‌హాల్‌లో ఆదివారం నిర్విరామ రికార్డు ఈవెంట్ ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. 35 మంది సినీ నేపథ్య గాయకులు 12 గంటల పాటు నిర్విరామంగా పాటలు పాడి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. ఫణి ఓరుగంటి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమానికి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కో ఆర్డినేటర్ డాక్టర్ నాగశ్రీ పాల్గొనగా వ్యాఖ్యాతగా యోగిత అక్కిరాజు సహకరించారని తెలిపారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

చిక్కడపల్లి: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన చిక్కడపల్లి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సుందరయ్యాపార్క్ ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని 28న సాయంత్రం కానిస్టేబుల్ లక్ష్మణ్ గుర్తించాడు. 108కు ఫోన్ చేసి రప్పించడంతో వారు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. అతడి వద్ద రష్ కేర్ ఆస్పత్రి, గాంధీ ఆస్పత్రిలో అడ్మిట్ అయిన చీటి లభ్యమైంది. దానిపై జహంగీర్‌నగర్ చింతలకుంట చెక్‌పోస్ట్ చిరునామా ఉందన్నారు. మృతుడిని గుర్తిస్తే ఫోన్ నం.87126 60163లో సంప్రదించాలని కోరారు.

పత్తాలేని

స్పెషల్ డ్రైవ్

- యాచకుల తరలింపుపై నిర్లక్ష్యం
- ఖైరతాబాద్‌లోని పలు ప్రధాన కూడళ్లలో భిక్షాటన
- పట్టించుకోని అధికారులు


ఫుట్‌పాత్ నిరాశ్రయులకు కౌన్సెలింగ్ ఇస్తున్న బంజారాహిల్స్ పోలీసులు

బంజారాహిల్స్: హైదరాబాద్‌ను బెగ్గర్ ఫ్రీ సిటీగా మార్చేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. నగరంలోని వివిధ కూడళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు యాచకులను గుర్తించి వారిని షెల్టర్ హోమ్స్‌కు తరలిస్తున్నారు. కొందరు యాచకుల వివరాలను తీసుకుని వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారు. చౌరస్తాల్లో యాచకులందరినీ గుర్తించి షెల్టర్ హోమ్స్‌కు తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17, జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వ రకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్లలోని చౌరస్తాల్లో మాత్రం ఈ స్పెషల్ డ్రైవ్ ప్రహసనంగా మారుతోంది. జీహెచ్‌ఎంసీ యూసీడీ విభాగం అధికారులు, సిబ్బంది ఇంతవరకు ఈ డివిజన్లలోని కూడళ్లలో తనిఖీలు చేపట్టలేదు. ఖైరతాబాద్, లక్డీకాపూల్, పంజగుట్ట, అమీర్‌పేట, బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చౌరస్తా, జూబ్లీహిల్స్ చౌరస్తా, ఇందిరానగర్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి, విరించి ఆస్పత్రి, తాజ్‌కృష్ణ చౌరస్తా తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో యాచకులు ఉండగా, ఇప్పటి వరకు వీరిని గుర్తించే పని కూడా యూసీడీ విభాగం అధికారులు సరిగా చేపట్టలేదు. వందల సంఖ్యలో యాచకులు నిత్యం ఆయా కూడళ్లలో చేతులు చాపుతూ వాహనదారులను ఇబ్బంది పెడుతున్నారు. అయితే ఖైరతాబాద్ సర్కిల్‌లో ఇప్పటి వరకు 15 మందిని, జూబ్లీహిల్స్ సర్కిల్‌లో 18 మందిని మాత్రమే యూసీడీ విభాగం గుర్తించింది. వీరందరినీ తాము గతంలోనే షెల్టర్ హోమ్స్‌కు తరలించామని, తిరిగి వస్తున్నారంటూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. షెల్టర్ హోమ్స్‌లలో సౌకర్యాలు సరిగా లేనందునే తాము తిరిగి చౌరస్తాలకు చేరుకుంటున్నామని యాచకులు పేర్కొంటున్నారు. నగరాన్ని బెగ్గర్ ఫ్రీ సిటీగా మార్చే ప్రక్రియలో ప్రభుత్వం చేపడుతున్న కార్యాచరణ ప్రణాళిక స్వయంగా ముఖ్యమంత్రి నివసిస్తున్న సర్కిల్‌లోనే అమలుకు నోచుకోవడం లేదు. యూసీడీ విభాగం గత 5 రోజులుగా ఈ ఆపరేషన్‌లో భాగంగా నగరంలోని ప్రధాన జంక్షన్లు, దేవాలయాలు, ఆస్పత్రులు, జనసమూహ ప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్న వారిని గుర్తించి వైద్య పరీక్షలు చేసి జీహెచ్‌ఎంసీ షెల్టర్ హోమ్‌కు తరలిస్తున్నారు. జూబ్లీహిల్స్ చౌరస్తా, కేబీఆర్ పార్కు చౌరస్తా, పంజగుట్ట చౌరస్తా, బంజారాహిల్స్ బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి చౌరస్తా, పెద్దమ్మ గుడి తదితర ప్రాంతాల్లో ఇప్పటిదాకా స్పెషల్ డ్రైవ్ చేపట్టలేదు. యాచకులతో పాటు ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న నిరాశ్రయులను కూడా తరలించే ప్రక్రియ రెగ్యులర్‌గా కొనసాగుతుందని జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ స్పష్టం చేశారు. అయితే బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ముందు మాత్రం నిరాశ్రయులను హోమ్స్‌కు తరలించే ప్రకియ సరిగ్గా జరగడం లేదు. గత కొంతకాలంగా బంజారాహిల్స్ పోలీసులు ఇక్కడ ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న నిరాశ్రయులకు కౌన్సెలింగ్ ఇచ్చి హమ్స్‌కు తరలిస్తున్నారు. అయితే వారిలో చాలామంది హోమ్స్‌కు వెళ్లిన మూడు రోజుల్లోనే తిరిగి బసవతారకం వైపు వస్తున్నారు. దీంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ప్రతిరోజూ బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వద్ద ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనాలు, రాత్రి భోజనాలు ఉచితంగా లభిస్తుండడంతో చాలా మంది అక్కడి నుంచి కదలడం లేదు. దీంతో పోలీసులు ఈ ప్రాంతంలో పికెటింగ్ ఏర్పాటు చేసినా పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. జీహెచ్‌ఎంసీ నిర్వాకం వల్లనే పరిస్థితి మారడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ యూసీడీ విభాగం అధికారులు ప్రధాన కూడళ్లలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి యాచకులను గుర్తించి వారికి మంచి సౌకర్యాలతో హోమ్స్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రిజర్వేషన్లు ఇచ్చాకే ఎన్నికలు నిర్వహించాలి

జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి



కాచిగూడ: బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇచ్చాకే ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే చరిత్ర మన్నించదని ఆయన పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లపై న్యాయ సలహాలు తీసుకుని ప్రత్యేక జీవో జారీ చేసే దిశగా ముందుకు పోవాలని ఆయన ఒక ప్రకటనలో సూచించారు. బీసీలకు 42 రిజర్వేషన్లు అమలు చేయడం ప్రభుత్వ బాధ్యతని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు ఇచ్చిన హామీని వమ్ము చేయకుండా చూడాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. బీసీల ఆశయాలను మాత్రం అడ్డుకోవద్దని ఆయన కోరారు. 42 శాతం రిజర్వేషన్లు బీసీల హక్కు అని రిజర్వేషన్లు అమలయ్యే వరకు బీసీ ఉద్యమం కొనసాగుతుందని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బీసీ బిల్లును 9వ షెడ్యుల్‌లో చేర్చకుండా కేంద్ర ప్రభుత్వం ఎందుకు అలస్యం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. రిజర్వేషన్ల విషయంలో బీసీలను మోస పూరితంగా కుట్రలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కేంద్రం తక్షణమే 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లులను ఆమోదించి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఇది బీసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. బీసీల రిజర్వేషన్లు అమలు చేయకపోతే బీసీలు ఓటు ద్వారానే తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

బీసీ గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: తెలంగాణలో బీసీ గురుకుల పాఠశాలలకు విద్యార్థుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ ఉన్నందున అదనంగా 119 బీసీ గురుకుల పాఠశాలలను మంజూరు చేయాలని కోరుతూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆదివారం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. పాత గురుకుల పాఠశాలల్లో వసతి సౌకర్యం ఉన్నచోట 5 నుంచి 8వ తరగతి వరకు అదనపు సెక్షన్లను ప్రారంభించాలని ఆయన కోరారు. గురుకుల పాఠశాలల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు ఇచ్చే విధంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎస్‌ఎస్‌సీ ఫలితాల్లో బీసీ గురుకులాల్లో 98శాతం ఫలితాలు రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకులాల్లో చేర్చడానికి ముందుకు వస్తున్నారని తెలిపారు. గురుకులాలను పెంచి పేద విద్యార్థులు చదువుకునే అవకాశం కల్పించాలన్నారు. గురుకులాలల్లో సీట్లు ఇప్పిస్తామని ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసగిస్తున్న బ్రోకర్లను, పైరవీకార్లను అరికట్టాలని, పోలీసులకు ఫిర్యాదు చేసి కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోరారు.

ఈశ్వరమ్మ బస్తీ సమస్యలను పరిష్కరించండి


ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఈశ్వరమ్మ బస్తీ ప్రతినిధులు

కవాడిగూడ: ఈశ్వరమ్మ బస్తీలో నెలకొన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు తనవంతు చర్యలు తీసుకుంటానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ నాయకుడు హరీష్‌యాదవ్, బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ పెద్దలతో కలిసి ఆదివారం ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. బస్తీలో ఇనుప స్తంభాల వల్ల విద్యుత్ షాక్ తగిలి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేకు తెలిపారు. వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఇటీవల బస్తీలో మంచినీటి, డ్రైనేజీ పైపులైన్‌లను జనాభాకు అనుగుణంగా ఆధునీకరించి రోడ్డు వేయకుండా వదిలేశారని చెప్పారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆయా శాఖల అధికారులకు ఫోన్ చేసి ఈశ్వరమ్మ బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, ఎన్‌డీ సాయికృష్ణ, సంతోష్, ప్రభాకర్, బస్తీ అధ్యక్షుడు కుమార్‌యాదవ్, చైర్మన్ జగన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ కోసం ఉద్యమించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి

కాచిగూడ: భారత రాజ్యాంగ రక్షణ కోసం దేశ పౌరులైన ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని సమాజ్‌వాది పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి పిలుపునిచ్చారు. ఆదివారం బర్కత్‌పురలో పార్టీ నేతలు డాక్టర్ నిమ్మతోట వెంకటేశ్వర్లు, కోకటి లక్ష్మణ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. భారత్‌కు రక్షణ కవచంగా నిలిచిన రాజ్యాంగాన్ని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధానకార్యదర్శి దత్తాత్రేయ హోసబోలే ఎందుకు వ్యతిరేకిస్తున్నాడని ప్రశ్నించారు. దేశ ప్రజల మధ్య సమానత్వాన్ని నిర్దేశించే సోషలిజం, సెక్యులరిజాన్ని ఆర్‌ఎస్‌ఎస్ అడ్డుకోవడానికి చూస్తోందని ఆయన అన్నారు. రాజ్యాంగాన్ని ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేకించడం అంటే భారతదేశాన్ని విచ్ఛిన్నం చేయడమే అవుతుందని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగం పట్ల దుష్టశక్తుల దాడి పెరుగుతున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం ద్వారా భారత్‌ను మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు.

సిటీ లైబ్రరీ వద్ద భారీ బందోబస్తు

చిక్కడపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆదివారం అశోక్‌నగర్‌లోని నగర కేంద్ర గ్రంథాలయం వద్ద నిరుద్యోగ అభ్యర్థులు రిలే దీక్షకు పిలుపునిచ్చారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో ఉదయం నుంచి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీక్ష చేయడానికి నిరుద్యోగ విద్యార్థులు వస్తే వారిని అరెస్టు చేయడానికి సరిపడ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. గ్రంథాలయంలో వచ్చి పోయే విద్యార్థులపై నిఘా పెట్టారు. అనుమానం వచ్చిన వారిపై ప్రశ్నించారు. సాయంత్రం నిరుద్యోగులు ఎవరు కూడా రాలేదు. ఇటీవలే నగర గ్రంథాలయానికి వచ్చిన రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్‌ను నిరుద్యోగులు అడ్డుకొని ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆయనను ప్రశ్నించిన విషయం విదితమే.


నగర కేంద్ర గ్రంథాలయ ఆవరణలో పోలీసులు

జాంబవ మహాముని జెండా రెపరెపలాడాలి


మాదిగల జెండా, కండువాను ఆవిష్కరిస్తున్న అంబాత్రాయ క్షేత్రం పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రతి మాదిగ ఇంటిపైన జాంబవ మహాముని జెండా రెపరెపలాడాలని శ్రీఅంబాత్రాయ క్షేత్రం పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ అన్నారు. ఆదివారం నారాయణపేట జిల్లా ఉటుకూరు మండలం విజ్వార్ గ్రామంలోని అంబాత్రాయ క్షేత్రంలో మాదిగల జెండా, కండువాను ఆవిష్కరించారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగల జెండా రంగు తొలు రంగు అని చెప్పారు. ప్రొఫెసర్ ఏకూ తిరుపతి రచించిన ఆది పురుషుడు – ఆది ధర్మం పుస్తకాన్ని ప్రతి మాదిగ చదువుకొని ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిపురుష ధర్మసమాజం రాష్ట్ర నాయకులు నల్ల సూర్యప్రకాష్, బోసుపల్లి ప్రతాప్, రాగాల నాగేశ్వర రావు గండి కృష్ణ , రుద్రవరం లింగ స్వామి, వశపాక నరిసింహ, డాక్టర్ పిడుగు మంజుల తదితరులు పాల్గొన్నారు.

గజల్ హిందీ అనువాద గ్రంథం ఆవిష్కరణ


సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న నర్సింహప్ప

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ గజల్ కవయిత్రి డా. విజయలక్ష్మి పండిట్ రచించిన గజల్ హిందీ అనువాద గ్రంథాన్ని ఇన్‌కంట్యాక్స్ రిటైర్డ్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ నర్సింహప్ప ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ గ్రంథం గజల్ ప్రియులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఆమె చేసిన ప్రయత్నాన్ని అభినందిస్తున్నట్లు చెప్పారు. ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్టు బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కవి మువ్వ శ్రీనివాస్‌రావు, భగీరథ పి.సునందాబాయి, యశోదదేవి, విజయ, మల్లికార్జున్‌రావు, భువనేశ్వరి, విద్యాసాగర్, సూరారం శంకర్, రాంశర్మ, రాధాకృష్ణ, క్రాంతికృష్ణ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యానగర్ వాసుల సమస్యలు పరిష్కరిస్తా


ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న అపార్ట్‌మెంట్ వాసులు

కవాడిగూడ: అడిక్‌మెట్ డివిజన్ విద్యానగర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలిపారు. ఆదివారం విద్యానగర్‌లోని సాయి మోహన్ ఎంక్లేవ్ అపార్ట్‌మెంట్ వాసులతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. చెట్ల కొమ్మలు పెరిగిపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. వెంటనే చెట్ల కొమ్మలను తొలగించాలని కోరారు. డ్రైనేజీ పొంగడంతో స్ట్రీట్ నం.7లో మొత్తం డ్రైనేజీ ప్రవహిస్తోందని తెలిపారు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, అసురేందర్, మాధవ్, ఖదీర్, ప్రభాకర్, అపార్ట్‌మెంట్ వాసులు మారుతీరావు, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

పతనం అంచున పెట్టుబడిదారి విధాన పరిస్థితులు


పాపారావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పెట్టుబడిదారి విధాన పరిస్థితులు పతనం అంచున ఉన్నాయని ప్రముఖ ఆర్థికవేత్త డి.పాపారావు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో ప్రజాపంద రాష్ట్ర కార్యదర్శి డీవీ కృష్ణ 3వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాపారావు మాట్లాడుతూ... 1980 దశకంలోనే నిజ ఆర్థిక వ్యవస్థకు పక్షవాతం వచ్చిందన్నారు. నేడు సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారి దేశాలలో ఉద్యోగాలు, ఉపాధి లేక సంక్షోభాలు నెలకొన్నాయని అన్నారు. పన్నుల పేరిట మోసపూరిత విధానాలను అవలంభిస్తున్నారని అన్నారు. ట్రంప్ అధ్యక్షుడిగా వచ్చినా అమెరికాలో ఉద్యోగాలు ఇవ్వలేక సంక్షోభంలో ఉన్నారని అన్నారు. ఉద్యోగాలు, ఉపాధి లేని సందర్భంలోనే ఫాసిస్టు విధానం ముందుకు వస్తుందని పేర్కొన్నారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.రమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కెచ్చెల రంగయ్య, చిన్న చంద్రన్న, కేజీ రామచందర్, వి.కృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.హన్మేష్, ఎస్‌ఎల్.పద్మ, కె.సూర్యం, ఎం.కృష్ణ, వి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రధాని మోదీ కృషి


భోలక్‌పూర్ డివిజన్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ రమేష్‌రాం

కవాడిగూడ: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం అన్నారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని చాకలి బస్తీలో బీజేపీ డివిజన్ కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రమేష్‌రాం మాట్లాడుతూ... ప్రధాని మోదీ 11 సంవత్సరాల పాలనలో దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచి ప్రపంచంలో అగ్రగామి దేశంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ప్రజా సంక్షేమానికి, చేతి వృత్తుల పరిరక్షణకు బడ్జెట్‌లో పెద్దపీట వేసి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శులు శివకుమార్, బబ్లూ, దిశా కమిటీ సభ్యుడు నందగిరి నర్సింహం, నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ మహేష సీనియర్ నాయకులు కృష్ణ, నిత్యానంద్, నాగేందర్, ఉపేందర్, వీరేశం, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ మన్‌కీ బాత్...

భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో డివిజన్ పోలింగ్‌బూత్ నం.138లో ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని మోదీ ప్రసంగాన్ని కార్యకర్తలు శ్రద్ధతో విన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం, జాయింట్ కన్వీనర్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట బోనాలకు సన్నద్ధం

- అంబర్‌పేట దేవాస్థాన సేవా సమితి సర్వసభ్య సమావేశం
- పకడ్బందీగా బోనాల ఏర్పాట్లకు సన్నాహాలు
- కమిటీ లెక్కలపై చర్చలు
- హనుమాన్ ఆలయ పునర్ నిర్మాణం ముందడుగుపై చర్చ


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి అధ్యక్షుడు శంకర్‌గౌడ్

అంబర్‌పేట: బోనాల వేడుకలను వైభంగా నిర్వహించేందుకు సన్నద్ధం అవుతున్నామని అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి అధ్యక్షుడు శంకర్‌గౌడ్ తెలిపారు. ఆదివారం బతుకమ్మకుంటలోని ఓ హోటల్ దేవస్థాన సేవా సమితి సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించిన బోనలు, ఇతర అంశాలపై చర్చించారు. రాబోయే బోనాల వేడుకలను అంబర్‌పేటలో ఘనంగా నిర్వహించేందకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. మహంకాళి ఆలయంలో నిర్వహించే బోనాల వేడుకలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. సమావేశంలో ప్రధానంగా బురుజు గల్లీలో ఉన్న హనుమాన్ ఆలయ పునర్‌నిర్మాణంపై విస్తృతంగా చర్చ జరిగింది. పురాతన ఆలయాన్ని అభివృద్ధి చేయాలంటూ స్థానికుల నుంచి కొన్ని ఏళ్లుగా వస్తున్న డిమాండ్‌పై నిర్ణయం తీసుకోవాల్సిన అవసరముందన్నారు.

◆ దేవస్థాన సేవా సమితి ఎన్నికల్లో హనుమాన్ ఆలయ నిర్మాణంపై హామి ఇచ్చినప్పటికీ ముందడుగు పడకపోవడంతో స్థానికులను నుంచి విమర్శలు వస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత కమిటీ కాల పరిమితి ముగిసేలోగా హనుమాన్ ఆలయ నిర్మాణంపై ముందడుగు వేయాలని నిర్ణయించారు. అలాగే దేవాస్థాన సేవా సమితి పరిధిలో ఉన్న ఆలయాల అభివృద్ధిపై సైతం దృష్టిసారించేందుకు కృషి చేస్తామన్నారు.

◆ ఈ సమావేశంలో కమిటీ లెక్కలపై కొంత వాదన జరిగింది. దేవాస్థాన సేవా సమితి నిర్వహణ లేక్కలపై ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకున్నారు. కమిటీ నిర్వహణ జమా, ఖర్చులను వివరించారు. అలాగే గతంలో ఎన్నడు లేని మాదిరిగా ఆలయ కమిటీ సమావేశంలో ఓ ప్రైవేటు హోటల్‌లో జరగడంపై స్థానికులు చర్చించుకున్నారు. సమావేశంలో కొందరు సభ్యులు సమావేశాన్ని హోటల్ ఏర్పాటు చేయడంపై ప్రశ్నించారు. దీనిపై నిర్వాహకులు దానికి గల కారణాలను వివరించారు. బోనాలపై ఘట ఊరేగింపు, జాతర, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో దేవస్థాన సేవా సమితి కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, పి.గిరిధర్‌గౌడ్, రంగంపల్లి రాజు, కిషోర్, గడ్డం శ్రీధర్‌గౌడ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.